క్లుప్తంగా

ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధి తాడేపల్లి అంజిరెడ్డి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫోర్టిఫైడ్ రైస్‌పై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌సీఐ కృష్ణా కెనాల్ డిపో మేనేజర్ కుబేర, మేనేజర్ క్యూసీ వాగ్య మాట్లాడుతూ.. ఫోర్టిఫైడ్ రైస్‌పై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. బియ్యం, ఇతర ఆహార ధాన్యాలతో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ కలిపి సరఫరా చేయడం ద్వారా పోషక లోపాన్ని నివారించవచ్చునని కేంద్రం గుర్తించిందని వివరించారు. బియ్యానికి జింకు, ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటి విటమిన్లు పోషకాలను కలిపిన కెర్నల్స్ మారుస్తారని అన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం గర్భిణులు, మహిళలు, పిల్లలు, బాలింతలు ఆహారంగా తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌సీఐ కృష్ణ కెనాల్ డిపో సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీకి పనిముట్లు అందజేత

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ జొన్న శ్రీనివాసరావు పంచాయతీ కార్మికులకు పారిశుద్ధ్య పనిముట్లను గురువారం అందజేశారు. ఉండవల్లి పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సరైన పనిముట్లు లేవు. దీనిని గమనించిన శ్రీనివాసరావు రూ.10 వేలు విలువ చేసే పనిముట్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలయ్య, ట్రస్ట్ సభ్యులు జొన్న దుర్గామల్లేశ్వరరావు, జొన్న శంకర్, గాలే వీరాంజనేయులు, దండమూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గణేష్ కళామందిరం వద్ద మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గురువారం టీడీపీ నాయకులు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్టీ మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ మాట్లాడుతూ.. పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు తాడేపల్లి పట్టణ పరిధిలో పలుచోట్ల మినరల్ వాటర్ ప్లాంట్ కావాలని కోరడంతో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ చొరవతో డీవీస్ లేబరేటరీ వారి సహకారంతో పలుచోట్ల వాటర్ ప్లాంట్ నిర్మాణాలను చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఓలేటి రాము, వెంకటేశ్వరరావు, డీవీస్ ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి నియామకం



తాడికొండ: బహుజ సమాజ్ పార్టీ(బీఎస్పీ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా తమను నియమించారని ఆ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న శృంగారపాటి బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. తమపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించినందుకు జిల్లా అధ్యక్షులు బందెల గౌతమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయాలపాలైన ఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయవాడ నుంచి గుంటూరు వెళుతున్న రెండు ద్విచక్రవాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో వాహనాలపై ప్రయాణిస్తున్న నలుగురు కింద పడడంతో గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వారిని సమీప ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించారు.

కొల్లిపర ఆలయంలో హోమాలు

కొల్లిపర: మండల కేంద్రంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవీ సమేత జనార్ధనస్వామి ఆలయం సమీపంలోని గరుత్మంతుడి స్తంభాన్ని ఇటీవల లారీ ఢీకొనడంతో పగిలిపోయింది. ఈ నేపథ్యాన్ని పురస్కరించుకుని గ్రామ పెద్దలు గురువారం పండితులు చేత వాస్తు తదితర హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామం సుభీక్షంగా ఉండాలంటూ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు జగన్నాధాచార్యులు, కుమార స్వామి, ప్రసాద్, పోగుల రామలింగేశ్వర శర్మ, నిరంజన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిటౌన్: రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామంలో ఆధునీకరిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం ఎంపీడీవో అత్తోట దీప్తి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చెత్త నుండి సంపద సృష్టి కేంద్రం ఉండేదని, షెడ్డు పాడవడం వలన తయారీ కేంద్రాన్ని ఆధునీకరించి వానపాముల ఎరువులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో లవ్ అండ్ కేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీ ముగ్గు రోడ్డు నుంచి మొదలై తాడేపల్లి పోలీస్‌స్టేషన్ మీదుగా ఉండవల్లి వరకు సాగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు బండ్లమూడి జాషువా మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గద్దె జాషువా, ప్రసాద్, ప్రభాకర్, జార్జ్, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తాడేపల్లి పట్టణ పరిధి గేటు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమార్ హసీన్ మాట్లాడుతూ.. నాషా ముక్తి భారత్ అభయాన్ కార్యక్రమంలో భాగంగా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తాడికొండ: మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం చట్టరీత్యా నేరమని.. అలాంటి వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు తుళ్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ మున్నీ అన్నారు. గురువారం తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. అనంతరం అనంతవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడికొండ: డ్రగ్స్ వినియోగం ద్వారా బంగారు భవిష్యత్తు ఉన్న కుటుంబాలు పతానానికి దారి తీస్తున్నాయని.. వీటి వాడకం వల్ల కలిగే అనర్థాలపై తెలియజేసి నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తాడికొండ ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.జోగారావు అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా గుంత!



ఎంటీఎంసీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యను నివారించేందుకు నులకపేట పంప్‌హౌస్ నుంచి ఎర్రబాలెం వరకు కొత్త పైప్‌లైను నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పైప్‌లైన్ కోసం తీసిన గుంతలు అక్కడక్కడ పూడ్చకపోవడం.. ఆ మట్టిని రోడ్డుపై పోయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారిలో పలుచోట్ల పైప్‌లైన్ల నుంచి తాగునీటిని వదిలిన సమయంలో ఎయిర్ బయటకు పోయేందుకు.. మరికొన్ని చోట్ల వాటర్ ట్యాంక్‌లకు మరో పైపులైను నిర్మించేందుకు గుంతలు తీశారు. వాటిని అలాగే వదిలేయడం.. ఆ మట్టిని రోడ్డుపై పోయడంతో రాత్రి పగలు తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటుగా ప్రయాణించే వారు ఇటీవల ఈ గుంతలో పడి తీవ్రంగా గాయాలపాలైన వారూ ఉన్నారు. డోలాస్‌నగర్, నులకపేట మధ్య ఎక్కడో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. కార్పొరేషన్ అధికారులు స్పందించి ఈ గుంతలను వెంటనే పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు. – తాడేపల్లి రూరల్

నట్టల నివారణ మందు పంపిణీ

ఫిరంగిపురం: మండలంలోని యర్రగుంట్లపాడు గ్రామంలో గురువారం నుదురుపాడు పశువైద్యశాల ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు(డీవార్మింగ్) ఇచ్చినట్లు పశువైద్యాధికారి షేక్.పీర్ అహ్మద్ తెలిపారు. 805 గొర్రెలు, 120 మేకలకు నట్టల నివారణ మందు వేశామని ఆయన చెప్పారు. జీవాల పెంపకం దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దీని ద్వారా జీవుల శరీరంలో ఉండే పేగు పురుగులు నశించిపోతాయన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, జీవాల పెంపకం దారులు, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన ఎంపీడీవో



తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో కె.సమతావాణి గురువారం పరిశీలించారు. పంచాయతీరాజ్ కమిషనర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జ్వరాల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో మురుగు నీటి కాలువలలో సిల్ట్ తొలగింపుతో పాటు ఇంటింటికీ చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత పనులపై ప్రత్యేక పర్యవేక్షణ, డ్రైవ్ ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. రోజూ పంచాయతీలలో కార్యదర్శులు సిబ్బందిపై పర్యవేక్షణ ఏర్పాటు చేసి గ్రామాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండేలా చూడాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొల్లిపర: గత కొన్ని రోజులుగా మండల పరిధిలో ఎక్కడో ఒకచోట దొంగతనాలు జరుగుతున్నాయని, కావున గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానస్పద స్థితిలో ఎవరైనా కనిపించినా, శుభకార్యాలకు, ఇతర పనుల నిమిత్తం కుటుంబంలో సభ్యులందరూ ఇతర పట్టణాలకు వెళ్లే సమయంలో ఇతర ప్రదేశాలకు వెళ్లే సమయంలో ఇంట్లో విలువైన వస్తువులు ఉంటే వాటిని వారి వెంట తీసుకువెళ్లాలని, బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకుని పోవాలని కోరారు. వారి ఇంటికి తగిన భద్రతలను చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే అటువంటి గృహాలకు పోలీస్ సిబ్బందిని కేటాయించి రాత్రి సమయంలో ఆ ఏరియా పరిశీలించడం జరుగుతుందన్నారు. వీలైనంతలో గృహాలకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రజలు ముందుకు రావాలని సూచించారు.

కార్మికులకు న్యాయం చేయాలి



దీక్షలు నిర్వహిస్తున్న ఏసీసీ కార్మికులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు గురువారం వర్షంలోనూ తమ పోరాటాన్ని ఆపలేదు. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 205 రోజులుగా కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం దీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ సుభాని, ఆశీర్వాదం, బాషా, కార్మికులు వై.సాంబశివరావు, సూర్యప్రకాశరావు, పిచ్చయ్య, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

120 ఏళ్ల రావి చెట్టు తొలగింపు



చెట్టు మానును తొలగిస్తున్న సిబ్బంది

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో 120 ఏళ్ల నాటి రావి చెట్టు, వేపచెట్టు ఇప్పటి వరకూ భక్తుల పూజలు అందుకుంది. కాగా రావి చెట్టు పూర్తిగా ఎండిపోవడంతో గురువారం కార్మికులతో తొలగించినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో బి.సురేష్ తెలిపారు. పూర్తిగా చెట్టు ఎండిపోవడంతో గాలి, వానకు భక్తులకు ఇబ్బంది కలిగే పరిస్థితి రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తగా దానిని తొలగించామన్నారు. దాని స్థానంలో మరో రావి మొక్కను నాటి పెంచనున్నట్లు ఆయన తెలిపారు.

వారాహి నవరాత్రి ఉత్సవాల ప్రారంభం



వారాహి అవతారంలో అమ్మవారు

తెనాలి: పట్టణ మారీస్‌పేటలోని శ్రీజగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం పీఠ పాలిత శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారికి గురువారం వారాహి అవతారంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. వారాహిదేవి హిందూ దేవతలలో ఒకరుగా, శక్తి అవతారంగా పూజలు అందుకుంటోందని ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతు మాధవరావు ఈ సందర్భంగా చెప్పారు. వరాహ ముఖంతో, ఎనిమిది చేతులతో, పాశం, శూలం, నాగలి వంటి ఆయుధాలతో చిత్రీకరిస్తారనీ, లలితాదేవి సైన్యాధ్యక్షురాలు అని కూడా నమ్ముతారనీ, వారాహి అమ్మవారిని రాత్రిపూట పూజించడం సాధారణమని చెప్పారు. నవరాత్రి ఉత్సవాల్లో యావన్మంది భక్తులు శ్రీవారాహి అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొన్నూరు నాగసూర్య శశిధరరావు, వరద వెంకట శేషగిరిరావు, తాడిపర్తి హరి, అంకమరాజు. భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నాగఫణి శర్మ శర్మ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు.

శ్రీనిధి రుణాలతో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధి

పెదకాకాని: డ్వాక్రా సంఘాల మహిళలకు శ్రీనిధి బ్యాంక్ అందిస్తున్న రుణాలు ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శ్రీనిధి ద్వారా రుణాలు తీసుకుని ఆ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధి చెందుతున్న మహిళలు బీహార్ రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతినిధుల బృందంతో పెదకాకానిలో సమావేశం ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు శ్రీనిధి రుణాల సద్వినియోగం చేసుకునే విధానాన్ని పరిశీలించేందుకు గుంటూరు జిల్లాకు వచ్చిన బీహార్ రాష్ట్ర ఆర్థికశాఖ ప్రతినిధులు పుష్పేంద్రసింగ్ తివారీ, అషితోష్ కుమార్‌లు గురువారం పెదకాకాని చేరుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. గతంలో రాష్ట్రంలో రూ.600 కోట్లతో ప్రారంభమైన శ్రీనిధి బ్యాంక్ ప్రస్తుతం రూ.6 వేల కోట్లకు టర్నోవర్‌కు చేరుకుందన్నారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొనాలి

కొల్లిపర: జూలై 9వ తేదీన జరిగే దేశ వ్యాపిత సమ్మెలో పంచాయతీ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ కొల్లిపర పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎ.లీలా కుమారికి శనివారం గ్రామపంచాయతీ ఉద్యోగుల కార్మికుల సంఘం సీఐటీయూ అనుబంధం సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందని తెలిపారు. దీనివలన కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు సమ్మె చేసే హక్కును కోల్పోతారని పేర్కొన్నారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని స్కీముల్లో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తించాలని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాపిత సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోదాసుందరరావు మల్లోల రమేష్ పుత్తూరు ఏసు పాదం కొల్లిపర కోటేశ్వరరావు గోదా ఏసు పాదం పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న యూపీహెచ్‌సీ వైద్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మానస మంజరి మాట్లాడుతూ.. ప్రస్తుతం మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ తీసుకోవడంతో పాటు నీటి తొట్లు, ట్యాంకులు అన్నింటినీ వారంలో ఒక రోజు శుభ్రం చేసుకోవాలని వివరించారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రక్తపరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబడి, తాడేపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి సుధీర్, హెచ్‌వీ శ్రీలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జయరాజు, ల్యాబ్ టెక్నీషియన్ రామోజీ, ఎఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీ 5.0 విజన్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న బాబు

మేడికొండూరు: మండల సమీపంలోని విసదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ 5.0 విజన్ అనే అంశంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కంపెనీ సీనియర్ డైరెక్టర్ తురుమళ్ల బాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్స్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కలిపి అభివృద్ధి చేసినా, కొన్ని కోట్ల డయోట్స్ నిర్మించిన చిప్స్ ద్వారా అతి తక్కువ ఉద్యోగస్తులతో అత్యధిక అభివృద్ధి సాధించవచ్చునని వెల్లడించారు. ఏఐ, ఎంఐ ద్వారా అనేక ఆవిష్కరణలు సాధించి, నూతన ఆవిష్కరణకు నాంది పలుకవచ్చన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఎంటెక్ పూర్తి చేసి ఒక గొప్ప చిప్ డిజైనింగ్ కంపెనీకి డైరెక్టర్‌గా ఎదగడం సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పూర్ణ శేఖర్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరంగా విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్నారై విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, ప్రిన్సిపాల్ డి.సంజయ్, ఏవో సీతారామయ్య, ప్రిన్సిపాల్ శ్రీహరి, వివిధ శాఖల అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంత్రి లోకేష్ అభినందనలు



వంశీని అభినందిస్తున్న మంత్రి నారా లోకేష్



మంత్రి లోకేష్‌తో ఉమామహేశ్వరి

తాడేపల్లి రూరల్: మహిళల ఆరోగ్యం కోసం మాగ్నా ప్యాడ్స్ పేరుతో స్మార్ట్ శానిటరీ ప్యాడ్స్‌ను రూపొందించిన విద్యార్థిని గురువారం మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని తన కార్యాలయంలో అభినందించారు. మంగళగిరికి చెందిన విద్యార్థి వనమా వంశీ వడ్లమూడిలోని విజ్ఞాన్ కళాశాలలో బీ ఫార్మసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఏప్రిల్ నెలలో ఢిల్లీలో జరిగిన స్టార్టప్ మహాకుంభ్ ఈవెంట్‌లో తనగైడ్ డాక్టర్ పి.శ్రీనివాస్ బాబు సహాయంతో మహిళల ఆరోగ్యం కోసం తాను రూపొందించిన స్మార్ట్ శానిటరీ ప్యాడ్స్‌ను ఆవిష్కరించాడు. దీంతో రూ.8 లక్షల నగదు బహుమతిని గెలుచుకుని సౌత్ ఇండియాలోనే ప్రథమంగా నిలిచాడు. ఈ సందర్భంగా వంశీకి భవిష్యత్తులో అండగా ఉంటామని.. అమరావతిలో ఏర్పాటు చేయనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రోత్సాహం అందిస్తాని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

దుగ్గిరాల, తాడేపల్లి రూరల్: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో దుగ్గిరాల మండలం టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి మంత్రి నారా లోకేష్ గురువారం ఉండవల్లిలోని తన కార్యాలయంలో చెక్కును అందజేశారు. రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదివిన గంపా ఉమామహేశ్వరి ఫలితాల్లో 575 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. దీంతో విద్యార్థిని ఉన్నత చదువుల నిమిత్తం మంత్రి నారా లోకేష్ తాను మంగళగిరి నియోజకవర్గంలో సాధించిన మెజార్టీ ఓట్లకు సమానంగా రూ.91,413 చెక్కును అందజేసి అభినందించారు. ఎంపీటీసీ మధుబాబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై మంత్రి లోకేష్‌కు వినతి..

తాడేపల్లి రూరల్: చేనేత సహకారం సంఘాలకు చెల్లించాల్సిన రూ.156 కోట్లను వెంటనే చెల్లించాలని కోరుతూ.. చేనేత సహకార సంఘాల నాయకులు గురువారం ఉండవల్లిలోని మంత్రి నారా లోకేష్ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. చేనేత రంగం కార్పొరేట్ విధానాలతో సంక్షోభంలో చిక్కుకుందని అన్నారు. 2024–25 సంవత్సరంలో చేనేతకు నామమాత్రం కేటాయింపులు జరిగాయని మంత్రి నారా లోకేష్‌కు వివరించినట్లు తెలిపారు. నేతన్నలు పలు సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి చలో తెనాలిని జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

దుగ్గిరాల: జూన్ 28న నిర్వహించనున్న చలో తెనాలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం చిలువూరు గ్రామంలో సీపీఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు జెట్టి బాలరాజు పాల్గొని కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. తెనాలి పోలీసులు దళిత, మైనార్టీ యువకులపై అమానుషంగా దాడి చేసిన సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో జ్యూడీషియల్ విచారణ జరిపించాలని కోరారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం.అంజియ్య, టి.రామారావు, కె.దావీదు, ఎస్.శ్రీనివాసరావు, కె.ప్రేమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారి వెంబడి జంగిల్ తొలగించాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి ఆదేశం



కవెవరం వంతెన ప్రక్కన వ్యర్థాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో దీప్తి

తెనాలిటౌన్: రూరల్ మండలం కవెవరం–నందివెలుగు ప్రధాన రహదారి వెంబడి జంగిల్‌ను తొలగించాలని ఎంపీడీవో అత్తోట దీప్తి అధికారులను ఆదేశించారు. గురువారం కవెవరం వంతెన వద్ద నుండి నందివెలుగు వరకు నాలుగు లైన్ల ప్రధాన రహదారి వెంబడి ఉన్న జంగిల్‌ను ఆమె పరిశీలించారు. కవెవరం వంతెన వద్ద కొబ్బరి బొండాలు, వ్యర్థాలు గుట్టలుగా పడవేయటాని గుర్తించి తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సోమసుందరపాలెం వద్ద నుండి రోడ్డు వెంబడి దట్టంగా పెరిగిన చెట్లు తొలగించాలని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదు మేరకు రోడ్డు వెంబడి జంగిల్‌ను తొలగిస్తున్నట్లు తెలిపారు. కవెవరం పంచాయతీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్, సోమసుందరపాలెం పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.